ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్‌ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మూడు, నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీకాం, బీబీఏ, బీఏ, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ ఫ్యాషన్ మేనేజ్మెంట్, బీబీఏ ఫ్యాషన్ డిజైన్ మేనేజ్మెంట్, బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ మూడు, అయిదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్సైట్ లో చూసుకోవాలని సూచించారు.

పద్మశాలి మహాసభలను విజయవంతం చేయాలి

చిక్కడపల్లి, మార్చి 5: నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో మార్చి 9న జరిగే అఖిలభారత పద్మశాలి సంఘం 17వ, తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం 8వ మహాసభలను జయప్రదం చేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన నాయకులతో మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పద్మశాలీ చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండి మహాసభకు తరలిరావాలని చెప్పారు. శ్రీకాంత్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాయన్న సేవలు చిరస్మరణీయం

- దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలు స్మరించుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

బొల్లారం, మార్చి 5: దివంగత ఎమ్మెల్యే సాయన్న సేవలు చిరస్మరణీయమని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం సాయన్న జయంతిని రసూల్‌పురా సిల్వర్ కాంపౌండ్‌లో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని పాల్గొని సాయన్న విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులకు, నాయకులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సాయన్న ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ఎవరికి ఏ అవసరం ఉన్నా తానున్నాననే నమ్మకం కల్పించారని గుర్తుచేశారు. భౌతికంగా సాయన్న మన మధ్యలో లేకున్నా, నిరంతరం ప్రజల మనసులో నిలిచిపోయారని అన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణాలు, త్రాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. ఇలాంటి అనేక మంచి కార్యక్రమాలను చేపట్టినందుకు ఐదు పర్యాయాలు సేవ చేసే అవకాశం ప్రజలు కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నాగేష్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ దేవులపల్లి శ్రీనివాస్, నరసింహ ముదిరాజ్, ఆకుల హరికృష్ణ, వార్డు అధ్యక్షుడు కుమార్‌ముదిరాజ్, రావుల సతీష్, సంతోష్, దేవరాజ్, ధనరాజ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



సాయన్న విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం విద్యార్థులకు కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బోయిన్‌పల్లిలో..

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా సాయన్న కృషి చేశారని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి అన్నారు. బోయిన్పల్లిలోని మహేశ్వర్‌రెడ్డి కార్యాలయంలో సాయన్న జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు పాండు యాదవ్,అనితా ప్రభాకర్, శ్యామ్ కుమార్, లోకనాథ్,నళిని కిరణ్, వార్డు అధ్యక్షుడు ఏ. నరసింహ రావు,పద్మ, రామక్రిష్ణ, నరసింహ, మధు,రమేష్, సదానంద్,అంబికా, భాగ్యమ్మ,సురేష్, బలరాం,బాబు రావు,శ్రీనివాస్, యుగేందర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పికెట్ చౌరస్తాలో..

మారేడ్‌పల్లి: కంటోన్మెంట్ నియోజకవర్గ దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న జయంతి కార్యక్రమం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏఎల్ ఆనంద్ ఆధ్వర్యంలో బుధవారం పికెట్ చౌరస్తాలో జరిగింది. దివంగత ఎమ్మెల్యే జి.సాయన్న చిత్రపటానికి బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శత్రు, డప్పు శేఖర్, సానాది శ్రీనివాస్, శ్రీహరి, భాస్కర్ ముదిరాజ్, రాకేష్, రామారావు, జోడి బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లిలో దివంగత ఎమ్మెల్యే సాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, బోర్డు మాజీ సభ్యులు

దివంగత ఎమ్మెల్యే సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

మహిళలు అన్ని రంగాలు రాణించాలి

చిక్కడపల్లి, మార్చి 5: మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారిస్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా బుధవారం చిక్కడపల్లిలోని బ్రహ్మకుమారిస్ కేంద్రంలో కుటుంబం, సమాజంలో శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడంలో మహిళల పాత్ర అనే అంశంపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబం, సమాజంలో శాంతి, సామరస్యాన్ని నెలకొల్పడంలో మహిళల పాత్ర చాలా కీలకమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముఠా నరేష్, చిక్కడపల్లి బ్రహ్మ కుమారిస్ కేంద్రం ఇన్‌చార్జి జయశ్రీ, ప్రతినిధులు రశ్మిత, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో సంక్షేమ పథకాల చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బేగంపేట మార్చి 5: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ కోరారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బన్సీలాల్‌పేటకు చెందిన ఏడుగురికి కల్యాణలక్ష్మి 5, షాదీముబారక్ ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి కుటుంబాలలో ఆడపడుచు పెండ్లి ఆర్థికంగా ఎంతో భారంతో కూడుకున్నదని పేర్కొన్నారు. వారికి చేయూత ఇవ్వాలనే ఉద్దేశంతో కేసీఆర్ రూ.లక్ష 116ల సహాయం అందించే గొప్ప కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, ముషీరాబాద్ ఆర్ఐలు సత్యప్రసాద్‌రావు, ప్రణీత్‌రావు, మాజీ కార్పొరేటర్ అత్తిలి మల్లికార్జున్‌గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్‌రాజు, ఆకుల హరికృష్ణ, నాయకులు లక్ష్మిపతి, ప్రేమ్‌కుమార్, మహేష్‌కుమార్‌యాదవ్, గజ్జెల శ్రీనివాస్, సాయి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మారేడ్ పల్లి: మోండా డివిజన్‌కు చెందిన పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మారేడుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమం బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ శిబిరం

శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బొల్లారం, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఆరో వార్డులో రోటరీ క్లబ్, ఆలిండియా జైన్ కటారియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు భవ్య, గోపీనాథ్, ఆలిండియా జైన్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆశాఅనిల్ కటారియా జైన్, ఉపాధ్యక్షురాలు రేఖసంజయ్ కటారియా, కోశాధికారి మమత కటారియా, కమిటీ సభ్యులు సునీత, రంజన, వైద్య సిబ్బంది ప్రసాద్, సత్యవతి, సంతోషి తదితరులు పాల్గొన్నారు

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌డీ అధ్యక్షుడు వల్లపనేని ప్రసాద్

చిక్కడపల్లి, మార్చి 5: దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డెవలప్మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ (డిఎస్‌డి) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. బుధవారం భాగ్‌లింగంపల్లిలోని డి.ఎస్.డి కార్యాలయంలో ఆయన మాట్లాడారు కేంద్ర ప్రభుత్వం యుడిఐడి కార్డ్స్ జారీ హామీ ఇవ్వడం మంచి పరిణామం అన్నారు. దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించడం జరిగిందన్నారు. దివ్యాంగులకు అందరికీ రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కోకన్వీనర్లు వెంకటేష్‌గౌడ్, ఇమ్రాన్, ప్రేమ్‌కుమార్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు ఆధునికతను అందిపుచ్చుకోవాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఐఏఎస్ అధికారి సుబ్రహ్మణ్యం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ న్యాక్ గుర్తింపు ప్రక్రియకు అధ్యాపకులను సన్నద్ధం చేసేందుకు మూడు రోజులుగా నిర్వహిస్తున్న 'న్యాక్ అక్రిడిటేషన్, అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ త్రూ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ పవర్డ్ డిజిటల్ లెర్నింగ్' వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమాన్ని రాగూర్ ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నిత్యవిద్యార్థిగా అధ్యాపకులు కాలానుగుణంగా ఆధునికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. సంప్రదాయ విద్యా విధానాల నుంచి ఆధునిక, డిజిటల్ విద్యా విధానానికి మారే క్రమంలో ఎదురవుతున్న సవాళ్ల గురించి వివరించారు. కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, డేటా అనలెటిక్స్ సహా ఆయా రంగాల్లో నైపుణ్యాధారిత విద్య, ఇంటర్న్‌షిప్స్, అంకురాల ఏర్పాటు, పరిశ్రమలతో కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు. ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్ దృక్పథాన్ని కొనసాగిస్తూనే అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పనిచేయాలని సూచించారు. ఇందులో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. న్యాక్ సహా ఎన్ ఐఆర్ఎఫ్, అంతర్జాతీయ స్థాయిలో ఓయూ ఉత్తమ విద్యాసంస్థగా గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ రీసర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ సీఈవో ఆర్.సుబ్రహ్మణ్యం, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్‌రెడ్డి, ఓఎన్డీ ప్రొఫెసర్ జితేందర్కుమార్ నాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్య, ఐక్యూఏసీ డైరెక్టర్ శిరీష, కోఆర్డినేటర్ డాక్టర్ హరీశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జనతా పార్టీని బలోపేతం చేస్తాం

బేగంపేట్, మార్చి 5: జనతా పార్టీని రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నవ్‌నీత్ చతుర్వేది అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ తర్వాత జయప్రకాష్ నారాయణ నేతృత్వంలోని జనతా పార్టీ అధికారం చేపట్టిందని గుర్తుచేశారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీని పునర్నిర్మించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో వివిధ పార్టీల్లో అసంతృప్తులతో ఉన్న నాయకులతో సంప్రదింపులు చేస్తున్నామని త్వరలో పార్టీ మరింత బలోపేతం అవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల నాటికి తెలుగు రాష్ట్రాలతో పాటు బీహార్, పంజాబ్. రాజస్థాన్ రాష్ట్రాల్లో బలమైన అభ్యర్థులతో బరిలో నిలిపి తమ సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ యువత విభాగం నాయకుడు చంద్రప్రకాశ్ పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం

ముఠా జైసింహ

చిక్కడపల్లి, మార్చి 5: కాంగ్రెస్ ప్రభుత్వ తప్పిదముతోనే ఎస్ఎల్‌బీసీ ప్రమాదం చోటుచేసుకుందని , ఈ ఘటనలో 8 మంది కార్మికులు బలి అయ్యారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ అన్నారు. బుధవారం గాంధీనగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సర్కారు తమ తప్పిదాలను కప్పిపుచ్చుకోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేయడం సరికాదన్నారు. డైవర్షన్ కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్ఎల్‌బీసీ పనులు చేసినా చేయలేదని అసత్య ప్రచారాలు, ఆరోపణలు చేయడం పట్ల మండిపడ్డారు. గత ప్రభుత్వంలో మూడు వేల తొమ్మిది వందల కోట్ల నిధులతో 11.5 కిలోమీటర్లు తువ్వడం జరిగిందన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని తగిన సమయంలో ప్రభుత్వానికి బుద్ధి చెప్తారని అన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

చిక్కడపల్లి, మార్చి 5: గాంధీనగర్‌లోని ఎల్లయ్య బస్తీలో బుధవారం ఓ ఇంట్లో తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికులు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. గాంధీనగర్ డివిజన్ ఎల్లయ్య బస్తీలో జబ్బార్ అనే వ్యక్తి తన భార్య అమీనా (60) తో కలిసి అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. బుధవారం తెల్లవారు జామున షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చిలరేగాయి. ఆ సమయంలో అమీనా ఇంట్లో ఒక్కతే నిద్రిస్తున్నది. ఒక్కసారిగా పొగ కమ్ముకోవడం కారణంగా ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. అదే భవనంలో పక్క ఇంట్లో అద్దెకుంటున్న రాజు వెంటనే స్పందించాడు. సాహసం చేసి మంటల్లో చిక్కుకున్న వృద్ధురాలని బయటికి తీసుకొచ్చాడు. ఈ క్రమంలో రాజు కాళ్లకు గాయాలు కావడంతో ఇరువురిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఇరువురి ప్రాణాలకు ఎలాంటి అపాయం లేదని తెలుస్తుంది. అదే విధంగా సమాచారం అందుకున్న ముషీరాబాద్ ఫైర్ స్టేషన్ సిబ్బంది వెంటనే ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ముఠా నరేష్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదేశాల మేరకు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితులకు సహాయ సహకారాలు అందిస్తామని, వారికి అండగా ఉంటామని నరేష్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో మాలల రోస్టర్ పాయింట్‌ను మార్చాలి

విలేకరుల సమావేశం అనంతరం నినాదాలు చేస్తున్న మాల యూత్ ఫెడరేషన్ చైర్మన్ మాందాల భాస్కర్, పలు సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ: అనైతికంగా జరిగిన ఎస్సీ వర్గీకరణను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వివిధ మాల సంఘాల నాయకులు స్పష్టం చేశారు. వర్గీకరణలో మాలల రోస్టర్ పాయింట్‌ను మార్చాలని డిమాండ్ చేశారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడుతూ గురువారం నిర్వహించనున్న రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వర్గీకరణ అంశాలను చర్చించబోయే అవకాశం ఉందని అన్నారు. రెండు అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం పునపరిశీలన చేసి, మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. 1, 2, 3 గ్రూపులుగా చేసిన వర్గీకరణను మాల, మాల అనుబంద కులాలుగా, మాదిగ, మాదిగ అనుబంద కులాలుగా రెండే గ్రూపులుగా విభజించాలని డిమాండ్ చేశారు. మాలలకు కేటాయించిన 22వ రోస్టర్ పాయింట్‌ను పునపరిశీలించి మాలలకు ఏడో రోస్టర్ పాయింట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు మాల రోస్టర్ పాయింట్ కన్నా మూడు రోస్టర్ పాయింట్లు ముందుగా ఉన్నాయని చెప్పారు. సామాజిక వెనుకబాటుతనం ఆధారంగా చేసుకొని పొందుపరచిన రిజర్వేషన్లలో ఆర్థిక పరమైన రిజర్వేషన్లు కల్పించిన ఈడబ్ల్యూఎస్ రోస్టర్ పాయింట్ల కంటే ఎక్కువ ఉండడం సిగ్గుచేటని విమర్శించారు. మంత్రి వర్గ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై సమీక్ష చేసి మాల, మాల అనుబంధ కులాలకు నష్టం జరగకుండా సవరణలు చేయాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందని అభిప్రాయపడ్డారు. లేనిపక్షంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ, టీచర్స్ ఎమ్మెల్సీల ఎన్నికల్లో జరిగిన పరాభవమే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో పునరావృతం అవుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాల యూత్ ఫెడరేషన్ చైర్మన్ మాందాల భాస్కర్, మాల స్టూడెంట్ జేఏసీ నేత మాదాసు రాహుల్, ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, విద్యార్థి నాయకులు పసరుగొండ కిషోర్, కొప్పుల అర్జున్, సింగి శ్రీకాంత్, ప్రవీణ్ కాంబ్లె, రవి, అంజి బాబు, గణేష్, శివకుమార్, లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న మహిళా శక్తి విభాగం నాయకులు

కవాడిగూడ, మార్చి 5: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం నాయకులు పిలుపునిచ్చారు. దోమలగూడ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహిళా శక్తి విభాగం నేతలు యమున, సుధారాణి, డాక్టర్ లక్ష్య, గాజుల మౌనిక పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు గడిచినా మహిళలపై దాడులు, అసమానత, లైంగికదాడులు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బేటీ పడావో బేటీ బచావో పిలుపునిచ్చిన ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయినా ఏమీ మాట్లాడరని అన్నారు. మహిళలు చదువుల్లో రాణించి రాజకీయాల్లోకి రావాలని, సాధికారత సాధించాలని పిలుపునిచ్చారు. ప్రతి మహిళ హక్కులు, సాధికారత సాధించాలని పేర్కొన్నారు.

అక్రమంగా గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న తుకారాంగేట్ సీఐ శంకర్

అడ్డగుట్ట, మార్చి 5: ఒడిస్సా నుంచి గంజాయి తీసుకొచ్చి నగరంలో విక్రయిస్తున్న ఓ వ్యక్తిని తుకారాం గేట్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ శంకర్ వివరాల ప్రకారం ఒడిస్సాలోని గంజిమ్‌కు చెందిన భూషణ్ పలాయి అలియాస్ రాజు (35) 2007లో నగరానికి వచ్చాడు. భవన నిర్మాణ కూలీగా, జొమాటో డెలివరీ బాయ్‌గా కూడా పనిచేశాడు. ఒడిస్సాలో పరిచయస్తుడు రాహుల్ నుంచి రూ.5వేలకు కొనుగోలు చేసి నగరంలో అధిక డబ్బుకు విక్రయించి డబ్బు సంపాదించేవాడు. విషయాన్ని తెలుసుకున్న హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్-ఎన్ఈ డబ్ల్యూ), తుకారాం గేట్ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ఈ నెల 3న ఆర్ఆర్‌సీ గ్రౌండ్ సమీపంలోని రైలు పట్టాల పక్కన ఖాళీ స్థలం వద్ద భూషణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద దొరికిన 100 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం దర్యాప్తులో భాగంగా భూషణ్ నివసించే కోకపేట్ ఇంటికి వెళ్లి అక్కడ నిల్వ ఉన్నటువంటి సుమారు 10 కిలోల గంజాయిని కూడా స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా నిందితుడి నుంచి 10.3 కిలోల గంజాయితో పాటు ఒక ద్విచక్ర వాహనం, వెయింగ్ మిషన్, సెల్‌ఫోన్, రూ.1210ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం భూషణ్‌ను తుకారాం గేట్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ సమావేశంలో హెచ్ఎన్ఈడబ్ల్యూ సీఐ జీఎస్ డానియల్, ఎస్ఐ వెంకటరాములు, ఎస్ఐ కిరణ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్ గొప్ప సంఘసంస్కర్త

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీలు లక్ష్మణ్, అనిల్ కుమార్

చిక్కడపల్లి, మార్చి 5: సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘసంస్కర్త అని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. సేవాలాల్ సేన గ్రేటర్ అధ్యక్షుడు కళ్యాణ్‌నాయక్ ఆధ్వర్యంలో బుధవారం బాగ్లింగంపల్లి లంబాడి తండా బస్తీలో బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతి సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎంపీలు డాక్టర్ లక్ష్మణ్, ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహ, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు భూక్య సంజీవ్‌నాయక్, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజోవత్, చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్, స్థానిక కార్పొరేటర్ రవిచారి హాజరయ్యారు. ఎమ్మెల్యే గోపాల్ మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ గిరిజనులతో పాటు సమాజంలో ఉన్న అందరినీ తన బోధనల ద్వారా చైతన్యపరిచారని అన్నారు. సేవాలాల్ జయంతిని 2014 నుంచి అధికారికంగా ప్రారంభించింది బీఆర్ఎస్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ బంజారాల ఆరాధ్య దేవం సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గం ఆచరణీయమని అన్నారు. సేవాలాల్ అందరికీ ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. అనంతరం అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భోజ్ మహారాజ్ సేవాలాల్ సేన సభ్యులు నెహ్రూ నాయక్, సంపత్ నాయక్, దేవేందర్ నాయక్, హోబా నాయక్, నవీన్ నాయక్, ప్రవీణ్ నాయక్, నారాయణ, బీఆర్ఎస్ నాయకులు శంకర్ ముదిరాజ్, ముచ్చకూర్తి ప్రభాకర్, కందూరు కృష్ణ, నాగభూషణం, కిషన్ రావు, వివేక్ నితిన్, పాల్గొన్నారు.